జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com






☀ బుధవారం సాయంత్రం సీదిరి ఇంటి వద్దకు పెద్ద ఎత్తున పోలీసులు ☀ సీదిరిని అరెస్టు చేస్తారంటూ సమాచారంతో తరలివచ్చిన వైసీపీ శ్రేణులు ☀ గట్టి బందోబస్తు నడుమ రాత్రి ఏడు గంటలకు కాశీబుగ్గ పీఎస్‌కు తరలింపు ☀ అడ్డుకున్న వైసీపీ శ్రేణులు ☀ పోలీసులు, పార్టీ శ్రేణుల మధ్య వాగ్వాదం, తోపులాట ☀ పోలీసులు, టీడీపీ నేతలకు వ్యతిరేకంగా వైసీపీ కేడర్ నినాదాలు ☀ సీదిరి తరలింపు సందర్భంగా ఎక్కడికక్కడ అడ్డుకున్న శ్రేణులు ☀ రోడ్డుపైనే బైఠాయించిన పార్టీ నాయకులు, ఆ తర్వాత ర్యాలీ ☀ పోలీసు బందోబస్తు నడుమ కాశీబుగ్గ స్టేషన్‌కు తరలింపు ☀ కన్నీరుమున్నీరైన సీదిరి భార్య ☀ పలాస-కాశీబుగ్గలో 144 సెక్షన్





పలాస, జులై 22 (వార్త): పలాస-కాశీబుగ్గలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. మాజీ మంత్రి, వైసీపీ నాయకుడు సీదిరి అప్పలరాజును బుధవారం రాత్రి కాశీబుగ్గ పోలీసులు అరెస్టు చేసి పోలీస్టేషన్‌కు తరలించారు. ఆయన కుమారుడు ఆరవ్ చేసిన రోడ్డు ప్రమాదానికి సంబంధించి వాస్తవాలు దాచడం, వ్యవస్థను తప్పుదోవ పట్టించినట్లు ఆయనపై పోలీసులు అభియోగం మోపారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం 5.23 గంటలకు శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద, కాశీబుగ్గ డీఎస్పీ భవానితో కూడిన పోలీసు బృందం జీఎంఈ కాలనీలో ఉండే అప్పలరాజు నివాసానికి చేరుకుంది. ఈవిషయం తెలుసుకున్న వెంటనే పెద్ద ఎత్తున వైసీపీ శ్రేణులు అక్కడికి తరలివచ్చారు. ఏడు గంటల సమయంలో సీదిరిని అరెస్టు చేసి వాహనంలో తరలిస్తుండగా వైసీపీ శ్రేణులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, వైసీపీ శ్రేణుల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. చివరకు పోలీసులు సీదిరిని వాహనంలో కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే స్టేషన్‌కు తరలిస్తున్న మార్గంలో వైసీపీ శ్రేణులు అడ్డుకున్నారు. వాహనం ముందుకుకదలకుండా రోడ్డుపైనే బైఠాయించి, పోలీసులు, టీడీపీ నాయకులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాశీబుగ్గ శ్రీనివాసలాడ్జి జంక్షన్ నుంచి మూడు రోడ్ల జంక్షన్ వరకూ ర్యాలీ చేశారు. ఎట్టకేలకు సీదిరిని పోలీసులు కాశీబుగ్గ స్టేషన్‌కు తరలించారు. సీదిరిని తరలించే సమయంలో ఆయన భార్య శ్రీదేవి కన్నీరుమున్నీరయ్యారు. సీదిరి అప్పలరాజు అరెస్టు నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. పలాస మండల పరిధిలో సెక్షన్ 144 సెక్షన్ అమల్లో ఉందని కాశీబుగ్గ పోలీసులు బుధవారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. గుంపుగా సమావేశాలు నిర్వహించడం, మారణాయుధాలతో రోడ్డుపై తిరగడం, ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించడం నిషేధమన్నారు. ఈ ఉత్తర్వులను ప్రజలందరూ పాటించి శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సహకరించాలని పోలీసులు కోరారు.





జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

### ఇంటర్‌లో ప్రవేశానికి
## దరఖాస్తుల ఆహ్వానం

**శ్రీకాకుళం, జులై 22 (వార్త):** విశాఖపట్నం జిల్లా మేఘాద్రి గెడ్డలోని డాక్టర్ బి.ఆర్ ఏజీ సెంట్రల్ ఆఫ్ ఎక్సెన్స్‌లో జూనియర్ ఇంటర్మీడియట్ సీనియర్ ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా సమన్వయ అధికారి వై యశోద లక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డా.బి.ఆర్. అంబేద్కర్ గురుకుల విద్యాలయాల సొసైటీ జిల్లా సమన్వయకర్త కార్యా లయం జిల్లాలోని ఎస్సీ విద్యార్థులు, ఇతర అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. విశాఖపట్నం జిల్లా మేఘాద్రిగడ్డలోని డా. బి.ఆర్.ఏ.జి. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో జూనియర్ ఇంటర్మీడియట్, సీని యర్ ఇంటర్మీడియట్ ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నా మన్నారు. ఈ సెంటర్ లో ప్రముఖ కోచింగ్ సంస్థల ద్వారా ఐఐటీ, నీట్ సమగ్ర కోచింగ్ అందించబడుతుందని, ఉన్నత విద్యలో ప్రతిభ కనబర చాలనుకునే విద్యార్థులకు ఇది ఒక మంచి అవకాశమ న్నారు. ఎస్సీ విద్యార్థులు 75 శాతం ఇతర వర్గాలు (ఎస్టీ, బీసీ, ఓసీ) -25 శాతం అర్హత కలిగిన విద్యార్థులు వెంటనే అధికారిక వెబ్సైట్ ద్వారా తమ దరఖాస్తులను ఆన్లైన్లో సమర్పించాలని ఆమె కోరారు. ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు జూలై 30వ తేదీ ఆఖరన్నారు. అదనపు వివ రాల కోసం 9441468091 నంబర్ను సంప్రదించవచ్చని, దరఖాస్తుల కోసం వెబ్సైట్: https://apbragcet. apcfss.inజిల్లాలోని ప్రధానో పాధ్యాయులు, తల్లి దండ్రులు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

### ప్రభుత్వ వైఫల్యంతోనే
## ఎరువుల కొరత
#### మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి




**పాతపట్నం, జులై 22 (వార్త):** ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి విమర్శిం చారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఎరువుల కోసం రైతులు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడిందని, యూరియా, డీఏపీ కొరతతో ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ పర్యవేక్షణ లోపం కారణంగా దళారుల ప్రమేయం పెరిగి రైతులు అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు. గతంలో రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే) ద్వారా రైతులకు అవసరమైన సేవలు అందించామని తెలిపారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను ప్రభుత్వం వెంటనే చక్కదిద్ది, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టి రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

### టీడీపీ బలోపేతానికి
## సమన్వయంతో పనిచేయాలి
#### పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

**పాతపట్నం, జులై22 (వార్త):** తెలుగుదేశం పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పిలుపునిచ్చారు. ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పాతపట్నంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన టీడీపీ క్యాడర్ సమావేశంలో ఎమ్మెల్యే గోవిందరావు పాల్గొని మాట్లాడారు. పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడంలో కార్యకర్తల పాత్ర కీలకమని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పరస్పర సహకారంతో పనిచేస్తే టీడీపీ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రక్రియ సజావుగా జరిగేలా నాయకులు, కార్యకర్తలు సహకరించాలని అన్నారు.మై టీడీపీ యాప్ ద్వారా పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ ప్రతిష్ఠను మరింత పెంచాలని సూచించారు.ఈ సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.








# కోట్లలో కుంభకోణం..
# భూరికార్డుల గల్లంతు

**☀ అప్పటి తహసీల్దార్ అవినీతి లీలలు.. ☀ రూ.కోట్లలో ముడుపులు చేతులు మారాయనే ప్రచారం ☀ ఆర్టీఐ విచారణతో గుట్టురట్టు ☀ కమిషన్ సమన్లతో అధికారుల దొంగనాటకాలు**



**శ్రీకాకుళం, జులై 22 (వార్త):** భూ రికార్డులను పరిరక్షించాల్సిన అధికారులే భక్షకులుగా మారితే ఎలా ఉంటుందో తెలిపే దారుణ ఉదంతం శ్రీకాకుళం మండలం తహసీల్దార్ కార్యాలయంలో వెలుగు చూసింది. కోట్ల రూపాయల విలువైన ప్రైవేటు భూమి రికార్డులను, ముఖ్యంగా వయోవృద్ధుల పేరున ఉన్న విలువైన భూములను దారిమళ్లించేందుకు రికార్డులను అవకతవకలకు గురిచేసి, ప్రశ్నించిన వారికి "పత్రాలు లభ్యం కావడం లేదు" అంటూ తప్పించుకునేందుకు చేసిన యత్నం అధికారుల మెడకు చుట్టుకుంటోంది. 2024 వరకు శ్రీకాకుళం తహసీల్దార్‌గా పనిచేసిన అప్పటి అధికారి హయాంలో వృద్ధుల భూములకు సంబంధించి అక్రమంగా మ్యుటేషన్లు చేసి, కోట్ల రూపాయల మేర ముడుపులు స్వీకరించారనే తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**తేదీల క్రమంలో వెలుగు చూసిన నిజాలు..**

**14-05-2024 (మొదటి దరఖాస్తు, దాటవేత):**
బాధితుల తరపున పి. సాయి రాహుల్ శ్రీకాకుళం పట్టణం, పాత శ్రీకాకుళం వార్డులోని పట్టణ సర్వే సంఖ్య 377/2 (రెవెన్యూ సర్వే సంఖ్య 248/2ఎ, 248/3) కి సంబంధించి పహాణీ (అడంగల్), 1-బి మరియు ఖాతా సంఖ్యలు 1070, 1071ల హక్కుల మార్పిడి (మ్యుటేషన్) ప్రతుల కోసం దరఖాస్తు చేశారు. తహసీల్దార్ కార్యాలయం సర్వే రికార్డు సంఖ్య 73/2024/సి ద్వారా అసంపూర్ణ సమాచారాన్ని అందజేసి చేతులు దులిపేసుకుంది.

**రెండవ అప్పీలు దాఖలు..**
అధికారులు సరైన సమాచారం ఇవ్వకపోవడంతో బాధితులు వెనక్కి తగ్గకుండా సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 19(3) ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషన్‌ను ఆశ్రయించి ద్వితీయ అప్పీల్ (సంఖ్య 6433/2024) దాఖలు చేశారు.

**13-07-2026 (మరో దరఖాస్తుకు తిరస్కరణ):**
ఇదే అంశంపై కస్పా వీధికి చెందిన కస్పా ఉమామహేశ్వర రావు ఖాతా సంఖ్యలు 1070, 1071ల మ్యుటేషన్ ప్రతుల కోసం దరఖాస్తు చేయగా, 20-07-2026నలి ఉప-తహసీల్దార్ "ఆ రికార్డులు మరియు ఫైళ్లు కార్యాలయములో లభ్యం కావడం లేదు" అని అధికారిక సమాధానం (ఎస్ఆర్ చీశీ. 165/2026/సి) ఇచ్చారు.

**రాష్ట్ర సమాచార కమిషన్ విచారణ.. చేతులు కాలడంతో కొత్త నాటకం..**
సమాచారం ఇవ్వకుండా దాటవేస్తుండటంతో రాష్ట్ర సమాచార కమిషన్ తీవ్రంగా పరిగణించి, 15-07-2026న ప్రత్యక్షంగా లేదా ఆన్‌లైన్ ద్వారా విచారణకు హాజరు కావాలని తహసీల్దార్‌తో పాటు ఫిర్యాదుదారునికి సమన్లు జారీ చేసింది. కమిషన్ నుంచి నోటీసులు రావడంతో భయపడిన అధికారులు, విచారణ తేదీ కంటే ముందే అంటే 10-07-2026న దరఖాస్తుదారుడిని కార్యాలయానికి పిలిపించి మిగిలిన సాధారణ రికార్డులను చూపించారు. అసలైన ఖాతా సంఖ్యలు 1070, 1071లకు సంబంధించిన మ్యుటేషన్ ఫైళ్లు, జతపరిచిన పత్రాలు కార్యాలయంలో లభ్యం కావడం లేదని నివేదికలోనే రాస్తూనే, మరోవైపు దరఖాస్తుదారుడితో "కోరిన సమాచారాన్ని పరిశీలించి సంతృప్తి చెందాను" అని తెలివిగా సంతకం చేయించుకుని కేసును క్లోజ్ చేయించేందుకు నివేదిక సిద్ధం చేయడం గమనార్హం.

**విచారణ జరిపితే బండారం బయటపడేనా..**
ముఖ్యమైన ఖాతాల మ్యుటేషన్ రికార్డులు అసలు ఆఫీసులోనే లేవని చెప్తూ, కేసు ముగించడానికి మాత్రం "సంతృప్తి చెందారు" అని రాయించుకోవడం అధికారుల దురుద్దేశాన్ని స్పష్టం చేస్తోంది. 2024 వరకు పనిచేసిన అప్పటి తహసీల్దార్ హయాంలో జరిగిన ఈ రికార్డుల మార్పిడి, అక్రమ మ్యుటేషన్లు, ఫైళ్ల మాయం వెనుక భారీ ఎత్తున నగదు చేతులు మారినట్లు బలమైన ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వ ఆధీనంలోని రికార్డులను మాయం చేయడం తీవ్రమైన నేరం. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, సర్వే సంఖ్యలు 248/2ఎ, 248/3 రికార్డుల ట్యాంపరింగ్‌పై, అలాగే అక్రమ మ్యుటేషన్లకు పాల్పడిన నాటి అధికారుల పాత్రపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**(గతంలో అధికారం చెలాయించిన వారి నుండి, నేడు చక్రం తిప్పుతున్న బడా నాయకుల మూకల వరకు ఈ భూమిని కాజేయడానికి సాగిస్తున్న యత్నాలు, అప్పటి రెవెన్యూ అధికారులు అక్రమంగా తయారు చేసిన రికార్డుల లీలలు.. తదితర పూర్తి వివరాలతో మరో సంచికలో కలుద్దాం)**



### రామావతారంలో
## జగన్నాథస్వామి

**శ్రీకాకుళం, జులై22(వార్త):** జగన్నాథ స్వామి రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారు రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి విశేష అలంకరణ చేపట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధా న అర్చకులు సుభాష్ చంద్ర పండా స్వామి వారికి విశేష పూజలు చేశా రు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఒడియా బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు బాలు పాణిగ్రాహి, తదితరులు సహాయ సహకారాలు అందజేశారు.

# లీలా వరప్రసాద్ మృతి.. జర్నలిజానికి తీరనిలోటు

**✱ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కేఆర్ రజిని ✱ శ్యామసుందరాపురంలో లీలా వరప్రసాద్ సంతాప సభ**




**టెక్కలి, జులై 22 (వార్త)::** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.లీలా వరప్రసాద్ మరణం వారి కుటుంబానికే కాదు, వారి గ్రామానికి, విశ్వవిద్యాలయానికి, సమాజానికి తీరనిలోటు అని పలువురు సంతాపం వ్యక్తం చేశారు. టెక్కలి సమీపంలోని శ్యామసుందరాపురంలో బుధవారం జరిగిన సంస్మరణ సభ నిర్వహించారు. లీలావరప్రసాద్ చిత్రపటానికి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కేఆర్ రజిని పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ లీలా వరప్రసాద్ వంటి వ్యక్తులు అరుదుగా జన్మిస్తారని, మంచి కార్యక్రమాలకి ఆయన అక్షర రూపం ఇచ్చారని, అతని జీవితం ఎంతోమందికి మార్గదర్శకమన్నారు. విజ్ఞానానికి విధేయతను మేళవిస్తే అది లీలా వరప్రసాద్ వ్యక్తిత్వమని, అతను లేని లోటు విశ్వవిద్యాలయంలో పూడ్చలేనిదని తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య బి.అడ్డయ్య మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో ఎన్నో కార్యక్రమాలను చాకచక్యంగా నిర్వహించిన సమర్థుడు డాక్టర్ లీలా వరప్రసాద్ అని, కేవలం విద్యాపరంగా మాత్రమే కాకుండా సామాజిక బాధ్యత కలిగిన వ్యక్తిగా లీలా వరప్రసాద్‌ను అందరూ గుర్తు చేసుకుంటారన్నారు. కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి మాట్లాడుతూ నిజాయితీ పరుడుగా, సేవాభావం కలిగిన వ్యక్తిగా లీలా ప్రసాద్‌ను అందరూ గుర్తు పెట్టుకుంటారని అన్నారు. లీలా మరణంతో తమ కుటుంబ సభ్యుడు పోయినంత బాధగా వుందన్నారు. యోగ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె తారకరామారావు మాట్లాడుతూ లీలా వర ప్రసాద్ విద్యార్థులు జర్నలిజం వృత్తిలో రాష్ట్ర వ్యాప్తంగా సేవలందిస్తున్నారని అన్నారు.అతనిలోని సహాయ గుణాన్ని ఆయన కొనియాడారు. టెక్కలి జర్నలిస్టు ఫోరం సభ్యులు బండి నరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం లో విశ్వ విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ డా కె సామ్రాజ్య లక్ష్మీ,కిల్లి కృపారాణి గారి భర్త డాక్టర్ కె.రామ్మోహన్ రావు, సీనియర్ జర్నలిస్ట్ పేడాడ పరమేశ్వరరావు, లైబ్రరీ సైన్స్ విభాగం అధ్యాపకులు డాక్టర్ కార్నాల శ్రీనివాసరావు, జర్నలిజం అధ్యాపకులు డా వై డి. రాందాస్, తెలుగు విభాగం అధ్యాపకులు డా కె. ఉదయ్ కిరణ్, లీలా ప్రసాద్ మేనల్లుడు సాయి ఉదయ్, ఇతర కుటుంబ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే జర్నలిజం పూర్వ విద్యార్థులు, వర్సిటీ విద్యార్థులు, వర్సిటీ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, గ్రామస్తులు తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# సీదిరి అరెస్ట్ రాజకీయ కక్షసాధింపే

**✻ మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు**

**శ్రీకాకుళం, జులై 22 (వార్త):** ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుని కూటమి నేతలు చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, సాధారణ ప్రమాద కేసును హత్య కేసుగా మార్చి సీదిరి అప్పలరాజు కుటుంబాన్ని వేధించడం ప్రజాస్వామ్య విరుద్ధమని, మత్స్యకార వర్గానికి ప్రాతినిధ్యం వహించిన నాయకుడిపై ప్రతీకార చర్యలు తగవని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే జైల్లే సమాధానమా అని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు ధ్వజమెత్తారు. తన క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., డాక్టర్ సీదిరి అప్పలరాజు కుమారుడు రోడ్డు ప్రమాదానికి కారణమయ్యాడనే ఆరోపణలపై పోలీసులు పెద్ద ఎత్తున చర్యలు చేపట్టి మాజీ మంత్రి అప్పలరాజును అరెస్ట్ చేయడం రాజకీయ కక్షసాధింపులో భాగమేనన్నారు. డాక్టర్ సీదిరి అప్పలరాజు చేసిన నేరం ఏమిటని ప్రశ్నించిన ధర్మాన, ప్రతిపక్ష నాయకుడిగా ఉండటమేనా ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రతిరోజూ అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయని, అలాంటి కేసుల్లో చట్ట ప్రకారం విచారణ జరిపి 41ఏ నోటీసులు జారీ చేసి కోర్టు పరిధిలో కేసు కొనసాగుతుందని చెప్పారు. కానీ ఈ కేసులో మాత్రం అసాధారణంగా వ్యవహరించి, ప్రమాదానికి కారణమైనట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై హత్యా నేరం నమోదు చేయడంతో పాటు, మాజీ మంత్రి అప్పలరాజును కూడా ముద్దాయిగా చేర్చి అరెస్ట్ చేయడం తీవ్ర అన్యాయమని పేర్కొన్నారు. ఇది ప్రజాస్వామ్యంలో రాజకీయ వేధింపులకు నిదర్శనమన్నారు. చట్టాన్ని రాజకీయ కక్ష తీర్చుకునే సాధనంగా ఉపయోగించడం సరికాదని ధర్మాన ప్రసాదరావు అన్నారు. నేడు రాష్ట్రవ్యాప్తంగా మత్స్యకారుల సమస్యలపై సమర్థంగా పోరాడే స్థాయికి ఎదిగిన నాయకుడిని లక్ష్యంగా చేసుకోవడం బాధాకరమని, ఒక ప్రమాద ఘటనను ఆధారంగా చేసుకుని ఆయన కుమారుడి భవిష్యత్తును దెబ్బతీయడం ప్రజలు అంగీకరించే చర్య కాదన్నారు. ప్రమాద కేసును నమోదు చేసిన దర్యాప్తు అధికారిని వెంటనే వీఆర్‌కు పంపించి, అనంతరం మరో అధికారిని నియమించి అదనంగా రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం చట్టబద్ధమైన దర్యాప్తు ప్రక్రియపై అనుమానాలు కలిగిస్తోందన్నారు. పలాస నియోజకవర్గంతో పాటు శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా ఈ అరెస్టు జరిగిన తీరు గురించి ప్రజలకు వివరించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కేవలం అధికార బలంతో ప్రతిపక్ష నాయకులను వరుసగా అరెస్టు చేస్తే ప్రభుత్వం శాశ్వతంగా కొనసాగుతుందని భావించడం పొరపాటని పేర్కొన్నారు.

## ప్రజా సంక్షేమమే లక్ష్యం కావాలి

**✻ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ✻ టీడీపీ విస్తృత క్యాడర్ సమావేశం**





**పోలాకి, జులై 22 (వార్త):** నరసన్నపేట నియోజకవర్గ అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, పార్టీ సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ స్థాయి విస్తృత క్యాడర్ సమావేశం శుక్రవారం పోలాకి మండలం కత్తిరివానిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. సమావేశానికి నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అధ్యక్షత వహించగా, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన పాల్గొన్నారు. సమావేశంలో నియోజకవర్గ అభివృద్ధి పనులు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత సమర్థవంతంగా తీసుకెళ్లడం, రాబోయే రాజకీయ కార్యాచరణ, పార్టీ సమన్వయ వ్యవస్థ బలోపేతం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ, ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, పార్టీ సిద్ధాంతాలను ప్రతి ఇంటికి చేరవేయాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి వచ్చిన నాయకులు తమ ప్రాంతాల్లోని స్థానిక సమస్యలను సమావేశంలో ప్రస్తావించగా, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన మాట్లాడుతూ, పార్టీ విజయాల్లో క్షేత్రస్థాయి కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ప్రతి కార్యకర్తకు పూర్తి మద్దతుగా నిలుస్తామని, ప్రజలకు మరింత చేరువై ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా వివరించాలని సూచించారు. పార్టీ బలోపేతంతో పాటు ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలుపై కార్యకర్తలు దృష్టి సారించాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, పీఏసీఎస్ చైర్మన్లు, వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు, రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలి

**✻ జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన ధర్నా ✻ రైతు వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరిక**




**శ్రీకాకుళం, జులై 22(వార్త):** కేంద్ర ప్రభుత్వం అమెరికాతో కుదుర్చుకోనున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ జిల్లా కాంగ్రెస్ కమిటీ, జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ధర్నా నిర్వహించారు. అఖిల భారత కిసాన్ మోర్చా, అఖిల భారత కిసాన్ కాంగ్రెస్ పిలుపు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైతు సంఘాలు, వ్యవసాయ కూలీలు, సీపీఎం, సీపీఐ నాయకులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సనపల అన్నాజీరావు మాట్లాడుతూ, ఈ నెల 24న అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదిరితే దేశవ్యాప్తంగా 11 కోట్ల మంది రైతులు, 8 కోట్ల మంది పాడి రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల ప్రయోజనాలకు విరుద్ధమైన ఈ ఒప్పందాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోత మధుసూదన్‌రావు మాట్లాడుతూ, రైతులకు నష్టం కలిగించే ఏ ఒప్పందాన్నీ అంగీకరించబోమని స్పష్టం చేశారు. ఇప్పటికే పంటలకు గిట్టుబాటు ధరలు లేక, ఎరువుల కొరత, ప్రకృతి విపత్తులు, ఆర్థిక ఇబ్బందులతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసిన సీ2౦50 శాతం సూత్రం ప్రకారం కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) అమలు చేయాలని, వరి, గోధుమ, మొక్కజొన్న, మినుములు, ఉద్యానవన పంటలకు గిట్టుబాటు ధర ప్రకటించాలని కోరారు. జిల్లాలో మొక్కజొన్న రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని, డీఏపీ ఎరువుల కొరత కూడా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయకపోతే రైతులతో కలిసి రాష్ట్రపతికి నేరుగా వినతిపత్రం అందజేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో బొడ్డేపల్లి గోవింద్ గోపాల్, కేవీఎల్ఎస్ ఈశ్వరి, రెల్ల సురేష్, మామిడి సత్యనారాయణ, ఆబోతుల వెంకటనాయుడు, ఇజ్జురోతు రమణ, లఖినేని నారాయణరావు, చాన్‌బాషా, ఆంధ్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. మోహన్‌రావు, జిల్లా అధ్యక్షుడు పోలాకి ప్రసాదరావు, జిల్లా కార్యదర్శి పొందూరు చంద్రరావు, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వెలమల రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చందు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లు సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి టీ. తేజేశ్వర, ఆంధ్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు బి. వాసుదేవరావు, గొల్లపల్లి దాలయ్య, సోడవరం చంద్రశేఖర్, కోత రామకృష్ణ, కోత సాగర్, గిన్ని రమేష్, గిన్ని రమేష్‌బాబు, లింగుడి కామరాజు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

**✻ ఎమ్మెల్యే కూన రవికుమార్**

**✻ ఆమదాలవలసలో నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం**




**ఆమదాలవలస, జులై 22 (వార్త):** ఆమదాలవలస పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో యూనిట్ ఇన్‌చార్జీలు, క్లస్టర్ ఇన్‌చార్జీలు పాల్గొన్నారు. సమావేశానికి ఆముదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ హాజరై పలు కీలక అంశాలపై సమీక్ష నిర్వహించారు. సర్ కార్యక్రమం, 'తల్లికి వందనం' పథకం, గ్రామాల్లో ఇళ్ల పట్టాల పంపిణీ, అలాగే ఈ నెల 24న నిర్వహించనున్న మెగా పేరెంట్స్ మీటింగ్ విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ప్రతి కార్యక్రమాన్ని సమన్వయంతో నిర్వహిస్తూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయాలని, క్షేత్రస్థాయిలో పార్టీ నాయకులు, ఇన్‌చార్జీలు చురుకుగా పనిచేయాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ సూచించారు. సమావేశంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### రవీంద్రభారతిలో ఘనంగా ఇన్వెస్టిట్యూర్ సెర్మని వేడుక



**సోంపేట, జులై 22 (వార్త):** పట్టణంలోని రవీంద్ర భారతి పాఠశాలలో ఇన్వెస్టిట్యూర్ సెర్మని వేడుక బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన స్థానిక ఎస్సై బి.మోహిని విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలను అందించారు. నాయకత్వ ప్రాముఖ్యతను నాయకత్వ లక్షణాలను విశిష్టతను గూర్చి ఎస్ఐ విద్యార్థులకు వివరించారు. విద్యాసంస్థల చైర్మన్ ఎంఎస్ మణి మాట్లాడుతూ చిత్తశుద్ధి,అంకితభావం, శ్రేష్టత, నిబద్ధత వంటి ఉత్తమ లక్షణాలు కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జోనల్ ఇంచార్జ్ ఎన్. వెంకటేష్, ప్రిన్సిపాల్ పి.కృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులందరూ పంటల బీమా నమోదు చేసుకోవాలి

**మెళియాపుట్టి, జులై 22 (వార్త):** గ్రామాలలో ఉన్న ప్రతి రైతు విధిగా పంటల బీమా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎస్ దాన కర్ణుడు అన్నారు. మెళియాపుట్టిమండలంలో బాణాపురం, బగడ, తదితర గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా క్షేత్ర పరిశీలన చేసి రైతులకు ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు వివరంగా తెలియజేశారు.పంట రుణాలు తీసుకున్న రైతులు బ్యాంకుల ద్వారా పంటలు బీమా నమోదు చేసుకోవాలని, అలాగే పంట రుణము తీసుకోకపోయినా రైతులు ఎకరాకి వరి పంట కి 160 రూపాయలు ప్రీమియం చెల్లించి మీ సేవలో పంటల బీమా నమోదు చేసుకోవాలన్నారు.శ్రీ వరి పంట బీమా నమోదుకు ఆగస్టు 15వ తేదీ ఆఖరి తేదీ అని పంటల బీమా విషయంలో రైతులకు ఎలాంటి సందేహాలు ఉన్న స్థానిక రైతు సేవ కేంద్రాన్ని లేదా మండల వ్యవసాయధికారిని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయధికారి దానకర్ణుడు తోపాటు గ్రామ వ్యవసాయ సహాయకులు సందీప్, కూటమి నాయకులు కృష్ణ, రైతులు తదితరులున్నారు.



### నూతన ఎస్ఐను కలిసిన మహిళా పోలీసులు



**జి.సిగడాం, జులై 22(వార్త):** జి.సిగడాం పోలీసుస్టేషన్ నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన అప్పలసూరిని బుధవారం మండల సచివాలయ మహిళా పోలీసులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, జూదం, అక్రమ మద్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. అనంతరం మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. అయెన మాట్లాడుతూ బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలని ఎస్ఐ సచివాలయ మహిళా పోలీసులకు సూచించారు. సచివాలయ పరిధిలో ఉన్న గ్రామీణ ప్రాంతాలలో బాల్యవివాహాలను ప్రోత్సహించిన, సహకరించినవారిపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సైబర్ క్రైములు, వరకట్న వేధింపులు, మహిళలపై అహహింస అలాంటివి జరిగితే స్థానిక పోలీస్ స్టేషనుకు తెలియజేయాలని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో పరిచయము లేని వ్యక్తులు, గుర్తు తెలియనివారు వస్తే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ రామకృష్ణారావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

### 108 అంబులెన్స్‌లో పాముకాటు నిరోధక ఇంజెక్షన్లు

**నరసన్నపేట, జులై 22 (వార్త):** పాముకాటుకు గురైన బాధితులకు అత్యవసర చికిత్సను వేగంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 108 అంబులెన్స్‌లలో పాముకాటు నిరోధక ఇంజెక్షన్లను అందుబాటులో ఉంచినట్లు 108 అత్యవసర వైద్య సేవల సిబ్బంది తెలిపారు. బుధవారం నరసన్నపేటలో 108 వాహన సిబ్బంది మాట్లాడుతూ, ప్రతి అంబులెన్స్‌లో రెండు యాంటీ స్నేక్ వెనం ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. అవసరమైన సందర్భాల్లో బాధితులకు ప్రాథమిక చికిత్సలో భాగంగా ఈ ఇంజెక్షన్లు అందించి వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్నామని చెప్పారు. వాహనంలో ఉన్న ఇంజెక్షన్లను వినియోగించిన అనంతరం వాటి స్థానంలో కొత్త ఇంజెక్షన్లను ప్రభుత్వం మళ్లీ సరఫరా చేస్తోందని తెలిపారు. దీంతో ప్రతి 108 వాహనంలో ఎల్లప్పుడూ అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో పాముకాట్ల ఘటనలు పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాముకాటుకు గురైన వారు ఎలాంటి మూఢనమ్మకాలను ఆశ్రయించకుండా వెంటనే 108కు సమాచారం అందించి వైద్య చికిత్స పొందాలని తెలిపారు. సమయానికి చికిత్స అందితే ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని 108 సిబ్బంది పేర్కొన్నారు.

### గ్రంథాలయ అధికారి లేక అవస్థలు

**నరసన్నపేట, జులై 22 (వార్త):** నరసన్నపేట మండల పరిషత్ ప్రాంగణంలో కొనసాగుతున్న శాఖా గ్రంథాలయం గత రెండేళ్లుగా ఇన్‌చార్జి పర్యవేక్షణలోనే కొనసాగుతుండటంతో గ్రంథాలయ సేవలు ఆశించిన స్థాయిలో అందడం లేదని పాఠకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జలుమూరు శాఖా గ్రంథాలయ అధికారిణి ఢిల్లీశ్వరికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినప్పటికీ, ఆమెకు రెండు చోట్ల బాధ్యతలు ఉండటంతో నరసన్నపేట గ్రంథాలయానికి తరచూ వచ్చేందుకు అవకాశం లేకపోతోందని స్థానికులు చెబుతున్నారు. దీంతో గ్రంథాలయ నిర్వహణపై ప్రభావం పడుతోందని పేర్కొంటున్నారు. ఒకప్పుడు విద్యార్థులు, ఉద్యోగార్థులు, పాఠకులతో నిత్యం సందడిగా ఉండే ఈ గ్రంథాలయం ప్రస్తుతం సందర్శకులు తగ్గిపోయిన పరిస్థితి నెలకొంది. గ్రంథాలయంలో రోజువారీ వార్తాపత్రికలు కూడా అందుబాటులో లేకపోవడంతో పాఠకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తాజా సమాచారాన్ని తెలుసుకునేందుకు వచ్చే వారికి నిరాశే ఎదురవుతోందని వాపోతున్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు, విద్యార్థులకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, అలాంటి కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు మెరుగుపర్చడంతో పాటు అవసరమైన పుస్తకాలు, వార్తాపత్రికలు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు. గ్రంథాలయ సేవలను మెరుగుపరిచేందుకు నరసన్నపేట శాఖా గ్రంథాలయానికి శాశ్వత అధికారిని నియమించి, పాఠకులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని స్థానికులు, విద్యార్థులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

### వంశధార ఎడమ కాలువలో గుర్రపుడెక్క తొలగింపు

**సారవకోట, జులై 22 (వార్త):** సారవకోట మండలంలోని వంశధార ఎడమ ప్రధాన కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్కను సంబంధిత అధికారులు తొలగించారు. కాలువలో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతున్నట్లు గుర్తించి చేపట్టిన ఈ చర్యతో దిగువ ప్రాంతాలకు సాగునీటి సరఫరా మెరుగుపడుతుందని అధికారులు తెలిపారు. గుమ్మపాడు, బద్రి, కిన్నెరవాడ, చీడిపూడి తదితర గ్రామాల సమీపంలోని వంతెనల వద్ద గుర్రపుడెక్క అధికంగా పేరుకుపోవడంతో నీటి ప్రవాహం మందగించి, దిగువ ప్రాంతాలకు అవసరమైన స్థాయిలో సాగు నీరు అందడం లేదని రైతులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన వంశధార శాఖ అధికారులు యంత్రాల సహాయంతో కాలువలోని గుర్రపుడెక్కను తొలగించి నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించారు. ఈ చర్యలతో సాగునీరు సాఫీగా దిగువ ప్రాంతాలకు చేరుకుని రైతులకు ప్రయోజనం చేకూరుతుందని అధికారులు పేర్కొన్నారు. కాలువల్లో ఎప్పటికప్పుడు పూడిక, గుర్రపుడెక్క తొలగింపు పనులు చేపట్టి నీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు కొనసాగిస్తామని అధికారులు తెలిపారు. రైతులు కూడా కాలువలను పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

### దానయ్య కుటుంబానికి ఆదుకుంటాం

**పలాస, జులై 22 (వార్త):** ఇటీవల రహదారి ప్రమాదంలో దురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోయిన దుబ్బ దానయ్య కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం, కూటమి నాయకులు అన్నివిధాలా అండగా ఉంటారని రాష్ట్ర గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, పలాస శాసనసభ్యు రాలు గౌతు శిరీష స్పష్టం చేశారు. ఈ నెల 10వ తేదీన జరిగిన మోటారు బైక్ ప్రమాదంలో దుబ్బ దానయ్య మృతి చెందిన నేపథ్యంలో బుధవారం పలాసలోని మృతుడి నివాసానికి వెళ్లిన మంత్రి, ఇచ్ఛాపురం, పలాస శాసన సభ్యులు బాధితులను స్వయంగా పరామర్శించి తీవ్ర సానుభూతిని తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చి వారిలో ధైర్యం నింపారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ.. ప్రమాదం జరిగిన వెంటనే పార్టీ స్పందించి రూ.10 లక్షల పరిహారాన్ని ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ ఆర్థిక సాయానికి అదనంగా, బాధిత కుటుంబాన్ని వ్యక్తిగతంగా ఆదు కోవాలనే ఉద్దేశంతో తమ తండ్రి, మాజీ పార్లమెంట్ సభ్యులైన కొలుసు పెదరెడ్డయ్య యాదవ్ ఛారిటబుల్ ట్రస్ట్ నుండి రూ.2 లక్షలు, యాదవ సంఘం నుండి రూ.3 లక్షలు ఈ ఐదు లక్షల రూపాయలు పార్టీ తరఫున ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే గౌతు శిరీష చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ "నేను కూడా ఒక గొర్రెల కాపరి కుటుంబం నుంచే వచ్చి, భగవంతుని, సమాజపు ఆశీస్సులతో ఈ స్థాయికి చేరుకున్నట్లు చెప్పారు. సోదరి గౌతు శిరీష వ్యక్తపరిచిన ఆవేదనను, బాధను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలన్నారు. ఒక సెంట్ భూమి కూడా లేకుండా, కూలీతో బతుకుతున్న ఒక నిరుపేద కుటుంబంలో ప్రమాదం వల్ల జరిగిన నష్టం పూడ్చలేనిదన్నారు. ఇక్కడికి వచ్చి, నిరుపేద కుటుంబం గురించి కనీస ప్రస్తావన చేయకుండా, ప్రమాదం చేసి మరణానికి కారణమైన 18 సంవత్సరాలు నిండిన మేజర్ యువకుడి గురించి మాట్లాడారంటే, ఆ పార్టీ డిఎన్ఏ ఎటువంటిదో ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలి" అని ఘాటుగా విమర్శించారు. పిల్లల చదువుల పూర్తి బాధ్యతను మేమందరం చూసుకుంటామన్నారు. ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ దానయ్య ఒక కటిక నిరుపేద అని తెలిసి ప్రతి ఒక్కరూ సాయం చేసేందుకు ముందుకు వస్తున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో ఇచ్ఛాపురం శాసన సభ్యులు, బెందాళం అశోక్, ప్రజాప్రతినిధులు, వివిధ బీసీ, యాదవ సంఘాల ప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## క్రైం వార్తలు

### ప్రేమ విఫలం కావడంతో యువకుడు ఆత్మహత్య



**పోలాకి, జులై 22 (వార్త):** పోలాకి మండలం పిన్నింటిపేట గ్రామానికి చెందిన యువకుడు ప్రేమ వ్యవహారంలో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విషాదాన్ని నింపింది. ఎస్సై రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం, పిన్నింటిపేట గ్రామానికి చెందిన బలగ నవీన్ (25) నరసన్నపేటలో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. తాను ప్రేమించిన యువతి తన ప్రేమను నిరాకరించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన నవీన్ సోమవారం రాత్రి విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం. అతడిని వెంటనే కుటుంబ సభ్యులు శ్రీకాకుళంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై రంజిత్ వెల్లడించారు.

### అండగా ఉన్న కొడుకు అందని లోకాలకు..

#### విద్యుత్ షాక్‌తో లైన్‌మెన్ మృతి



**సోంపేట, జులై 22(వార్త):** నిరుపేద కుటుంబంలో ఒక్కగానొక్క కొడుకుగా పుట్టి 10 ఏళ్ల క్రితం తండ్రి మరణించడంతో మిగతా కుటుంబానికి అండగా ఉంటున్న ఆ కొడుకును విధి వెక్కిరించింది. తల్లి, చెల్లిని పోషించుకుంటూ తల్లి అనారోగ్య బాధ్యతలు చూస్తూ చెల్లెలు చదువులు కోసం సహకరిస్తూ నిరంతరం కష్టపడుతూ కుటుంబాన్ని నడుపుతున్న జింకిభద్ర గ్రామానికి చెందిన నాతి ధర్మారావు (25) బుధవారం ఉదయం అకాల మరణం చెందాడు. కన్నతల్లిని తోడబుట్టిన చెల్లెలను ఎంతో ప్రేమగా పెంచుకుంటూ పోషిస్తున్న ధర్మారావుపై మృత్యువు కన్నెర్ర చేసింది. విద్యుత్ శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో లైన్‌మెన్ గా పనిచేస్తున్న ధర్మారావు స్థానిక తహసిల్దార్ కార్యాలయం సమీపంలో చేంజ్ ఓవర్ మారుస్తుండగా కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాడు. మిగతా సిబ్బంది వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. నిరుపేద కుటుంబానికి అండగా ఉంటూ... ఎటువంటి ఆస్తిపాస్తులు లేని నిరుపేద కుటుంబంలో పుట్టి కుటుంబాన్ని ముందుకు నడిపిస్తున్న ధర్మారావు మృతి ప్రతి ఒక్కరినీ కలిచి వేసింది. కాంట్రాక్ట్ లైన్మెన్ గా పనిచేస్తూ వచ్చిన కొద్దిపాటి జీతంతో పాటు కుటుంబ పోషణ కోసం ఆదాయం చాలీచాలని పరిస్థితుల్లో గ్రామ సమీపంలో ఫాస్ట్ ఫుడ్ సెంటర్ కూడా నిర్వహిస్తున్న ధర్మారావు ఇలా మృత్యువాత పడడం అందరినీ విషాదంలో ముంచేసింది. గ్రామంలోని యువకులతో స్నేహంగా ఉంటూ అందరి వద్ద మంచి వాడిగా గుర్తింపు పొందిన ధర్మారావు ఇలా ఆకస్మికంగా మృతి చెందడం తో జింకిభద్ర గ్రామంలో విషాదం అలుముకుంది. ఆ కుటుంబానికి దిక్కెవరు... ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో అనారోగ్యంతో ఉన్న తల్లికి చదువుకుంటున్న చెల్లికి ఇక దిక్కు ఎవరంటూ అందరూ ఆలోచిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో అన్ని వర్గాలు ఆ కుటుంబానికి అండగా నిలవాలని కోరుతున్నారు.

### కొనసాగుతున్న రైటర్ల నిరసన

**సోంపేట, జులై 22 (వార్త):** దస్తావేజు లేఖర్ల నిరసన సోంపేటలో మూడవ రోజుకు చేరింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా నిరసన కొనసాగిస్తున్నారు. దస్తావేజు లేఖర్ల పని వ్యవహారాలను ప్రైవేట్ కాంట్రాక్టర్లకు ప్రభుత్వం అప్పగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈనెల 31 వరకు తమ ఆందోళన కొనసాగుతుందని లేఖరులు తెలిపారు. వివిధ వర్గాలకు చెందిన ప్రముఖులు దస్తావేజులేఖర్ల నిరసనకు సంఘీభావం తెలుపుతున్నారు. బుధవారం నాటి నిరసన కార్యక్రమానికి కోదండరామ ఆలయ ట్రస్ట్ కమిటీ చైర్మన్ బీన ఆనందరావు, బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధి గోవిందరాజులు హాజరై తమ సంఘీభావం తెలిపారు.

### చెరువు ఆక్రమణల వివరాలు అందజేత



**సోంపేట, జులై 22 (వార్త):** సోంపేట పట్టణంలోని బిరుసువాడ రెవెన్యూ పరిధిలో జెన్నాగాయి చెరువు ఆక్రమణలపై స్థానిక కోదండ రామాలయం కమిటీ చైర్మన్ బీన ఆనందరావుతోపాటు పలువురు ఇటీవల కలెక్టర్ గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పలాస ఆర్డీఓ కార్యాలయం నుంచి అందిన సమాచారం మేరకు ఆనందరావు ఆధ్వర్యంలో పలువు రైతులు, స్థానికులు కలిసి పలాస ఆర్డీవో కార్యాలయానికి బుధవారం హాజరయ్యారు. ఆర్డీవో కార్యాలయం అధికారులకు చెరువు మ్యాప్ తో పాటు ఆక్రమణల వివరాలను అందజేశారు. వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆక్రమణలు తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ఉపాధ్యక్షుడు పొందూరు రాజు, కోర్ణాల ఆదినారాయణ, దున్న జోగారావు,పిట్ట చిరంజీవి, దుద్ది చిరంజీవి,రంగోయి పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

### దానయ్య కుటుంబానికి
## గుంట కిరణ్ ఆర్థిక సాయం

**పలాస, జులై 22 (వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 18వ వార్డుకు చెందిన జనసేన పార్టీ నాయకుడు గుంట కిరణ్ మానవత్వాన్ని చాటుకున్నారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో పలాస సూది కొండకు చెందిన గొర్రెల కాపరి దుబ్బ దానయ్య అకాల మరణం చెందగా, ఆయన కుటుంబాన్ని కిరణ్ పరామర్శించి రూ.5,000 ఆర్థిక సాయం బుధవారం అందజేశారు.విషాద సమయంలో బాధిత కుటుంబానికి అండగా నిలవాలన్న ఉద్దేశంతో గుంట కిరణ్ వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కష్టకాలంలో తమవంతు సహాయంగా అందించిన ఆర్థిక సాయం కుటుంబానికి కొంత ధైర్యం కలిగించిందని స్థానికులు పేర్కొన్నారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో ముందుండే గుంట కిరణ్ సేవా నిరతికి, మానవత్వానికి పలువురు అభినందనలు తెలిపారు.



# మిర్తిబట్టి కెనాల్‌పై అక్రమ నిర్మాణం తొలగించండి

✻ అడ్డుకోకుంటే అధికారులపై ఫిర్యాదు చేస్తాం ✻ కాలువ గట్లను ఆక్రమించే వ్యక్తి ఎమ్మెల్యేగా అర్హుడా ✻ 48 గంటలలోగా పనులను నిలుపుదల చేయాలి ✻ లేకుంటే రైతులతో కలిసి ఈనెల 24న తొలగిస్తాం ✻ వైసీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్



**ఆమదాలవలస, జులై22 (వార్త):** నారాయణపురం లెఫ్ట్ మెయిన్ కెనాల్ (మిర్చిబట్టి)పై చేపడుతున్న అక్రమ నిర్మాణాలను తక్షణమే తొలగించాలని, కెనాల్ పై నిర్మాణాలు చేపట్టడం సిగ్గుమాలిన చర్య అని ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త చింతాడ రవికుమార్ పేర్కొన్నారు. ఆమదాలవలస వైఎస్ఆర్సిపి నియోజకవర్గ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతాడ రవికుమార్ మాట్లాడుతూ కొత్త రోడ్డు జంక్షన్‌లో కెనాల్‌పై అక్రమంగా నిర్మాణాలు చేపట్టి అక్కడి స్థలాన్ని కబ్జా చేయాలని చూస్తున్న కూన రవికుమార్ బుద్ధి నీఛమన్నారు. 200 అడుగుల మేర కెనాల్‌ను కప్పేసి సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తాననడం దుర్మార్గమని చెప్పారు. కెనాల్‌ను ఆక్రమిస్తుంటే అధికారులు చూస్తూ ఉండడం ఆశ్చర్యానికి గురిచేస్తోందన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారుల అనుమతి లేకుండా ఇటువంటి ఆక్రమణలు పాల్పడుతున్న కూన రవికుమార్ ఎమ్మెల్యేగా అర్హుడా అని టిడిపి క్యాడర్ ను ప్రశ్నించారు. కెనాల్‌ను ఆక్రమించడంతో తోటాడలో వందల ఎకరాలు నీట మునిగిపోతాయన్నారు. తక్షణమే కెనాల్ ఆక్రమణలను తొలగించి నిర్మాణాలను నిలుపుదల చేయకుంటే ఈనెల 24న రైతులతో కలిసి ఈ నిర్మాణాలను అడ్డుకుంటామని చింతాడ రవికుమార్ హెచ్చరించారు. ఇప్పటికే జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఈ అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేశామని వివరించారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోకుంటే భవిష్యత్తులో సంబంధిత అధికారులపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని రవికుమార్ హెచ్చరించారు. భూ, ఇసుక, ఖనిజ దోపిడీలకు, తప్పుడు ధ్రువపత్రాల సృష్టికర్త అయిన కూన రవికుమార్‌కు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని విమర్శించే స్థాయి లేదన్నారు. చేపల చెరువు వేలం పాటకు ఇచ్చిన డబ్బులను నొక్కేసిన ప్రక్రియతోనే నీ ప్రయాణం మొదలైందని గుర్తు చేశారు. కోటిపల్లి రామాలయం పూజారికిచ్చిన భూమిని, నవభారత్ జంక్షన్ వద్ద చెరువు స్థలాన్ని, బురిడి కంచరాంలో పరిశ్రమ స్థలాన్ని, బావాజీ మఠం భూములను కబ్జా చేసిన చరిత్ర నీది కాదా అంటూ ప్రశ్నించారు. ఇసుక దోపిడీకి అడ్డూ అదుపు లేకుండా పోయిందన్నారు. కొత్తవలస నుండి రాగోలు వరకు 12 నుంచి 13 గ్రామాల రోడ్లు ఇసుక లారీల రాకపోకలతో పూర్తిగా అధ్వాన్న స్థితికి చేరిపోయిందని పేర్కొన్నారు. నీ గ్రావెల్ దందా గురించి తోటి ఎమ్మెల్యే ఎన్ఎఆర్ అసెంబ్లీ సాక్షిగా విమర్శించిన మాటలను గుర్తు చేసుకోవాలని కూన రవికుమార్‌కు హితవు పలికారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని విమర్శించే మొనగాడివా అంటూ ప్రశ్నించారు. మీ మామ పేరుతో భూకబ్జాలు, ఉద్యోగాలు ఇప్పిస్తామని బాధితుల నుంచి నగదు వసూలు చేసిన విషయాలు మర్చిపోయావా ఎద్దేవా చేశారు. మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు కూన రవికుమార్ చేసిన అభివృద్ధి గురించి చెప్పాలన్నారు. ఎన్టీ రామారావును వెన్నుపోటు పొడిచి పార్టీని హస్తగతం చేసుకున్న చంద్రబాబు నాయుడుది గునపం పార్టీ కాదా అంటూ ప్రశ్నించారు. మీడియా సమావేశంలో వైఎస్ఆర్సిపి నాయకులు ఖండాపు గోవిందరావు, సురవరపు నాగేశ్వరరావు, గురుగుబెల్లి శ్రీనివాసరావు, దుంపల శ్యామలరావు పట్టణ అధ్యక్షులు పొడుగు శ్రీనివాసరావు, రవికాంత్, గురుగుబెల్లి నవీన్, పార్టీ ముఖ్య నేతలు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం అండ



✻ ఎమ్మెల్యే కూన రవి కుమార్

**శ్రీకాకుళం, జులై 22(వార్త):** మహిళా శక్తికి, మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోందని ఆమదాలవలస శాసనసభ్యులు, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ స్పష్టం చేశారు. శ్రీకాకుళంలో కోవే ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టిక్ కుకింగ్ కాంపిటీషన్ 10 రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లాస్థాయి కుకింగ్ ట్రైనింగ్, వంటల పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన మహిళలకు బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల్లో ఉన్న సృజనాత్మకత, నైపుణ్యం, ఆత్మవిశ్వాసాన్ని వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. వంటకళలో ప్రతిభ చూపిన మహిళలు దానిని కుటుంబానికే పరిమితం చేయకుండా, వ్యాపార అవకాశాలుగా మలచుకొని స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని సూచించారు.మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగి స్వయం ఉపాధి అవకాశాలు సృష్టించుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సాహం, శిక్షణ, రుణాలు, సబ్సిడీలు, అవసరమైన సహాయ సహకారాలను అందిస్తోందని తెలిపారు. ఆహార ఉత్పత్తులు, విలువ ఆధారిత ఆహార పదార్థాల తయారీ వంటి రంగాల్లో మహిళలు ముందుకు వచ్చి విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. కోవే ఆర్గనైజేషన్ నిర్వహించిన ఈ కార్యక్రమం ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లతో పాటు ఔత్సాహిక పారిశ్రామిక దృక్పథాన్ని పెంపొందించేలా ఉండడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో కోవే ఇండియా జాతీయ కార్యదర్శి డి. అపర్ణ, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు రాధిక, గురజాడ విద్యా సంస్థల డైరెక్టర్ జి. సంయుక్త, కోవే ఆర్గనైజేషన్ ప్రతినిధులు, ప్రముఖులు, మహిళా సంఘాల సభ్యులు, పోటీల్లో పాల్గొన్న మహిళలు పాల్గొన్నారు.

### అమరావతి ఛాంపియన్షిప్ కప్
## మూడవ రోజు ఎంపికైన జాబితా

**పలాస, జులై 22 (వార్త):** అమరావతి ఛాంపియన్షిప్ కప్ మూడవ రోజు బుధవారం జరిగే ఎంపికల కార్యక్రమమని పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించారు. 17, 23 సంవత్సరాల వయసు బలబాలికలకి అథ్లెటిక్స్ (యోగ), బాస్కెట్బాల్, వెయిట్ లిఫ్టింగ్ విభాగాల్లో ఎంపికలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి. రవికుమార్ అధ్యక్షత వహించిన కార్యక్రమాన్ని జిల్లా విద్యా వ్యాయామ సంఘ అధ్యక్షుడు పి. తవిటయ్య పర్యవేక్షించారు. రాష్ట్ర అథలిటిక్స్ కమిటీ కన్వీనర్ కే. హరిబాబు మాస్టర్ ముఖ్య అతిథిగా హాజరవుతూ ఎంపికల ప్రామాణికతపై దృష్టిపెట్టారు.పలాస నియోజకవర్గ క్రీడల నిర్వహణ బాధ్యులు సిహెచ్. పద్మలోచన, జిల్లా విద్యా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యక్షులు ఎస్. రామారావు, మొదటి జోన్ కార్యదర్శి పి. గజేంద్రరావు, పలాస మండల క్రీడా నిర్వహణ బాధ్యులు ఎస్. చంద్రశేఖర్, ప్రభుత్వ పాఠశాల సహోపాధ్యాయురాలు ఆర్. రాజ్యలక్ష్మి కార్యక్రమంలో పాల్గొని నిర్వహణలో సహకరించారు. లాంగ్ జంప్పురుషులు / బాలురు: ఎమ్. కృపాసింధు (నువ్వలారేవు) ఎమ్. నీతు( ఎస్ బి ఎస్ వై ఎం కాశీబుగ్గ)హై జంప్మొదటి స్థానం: ఎస్. చంటి (జీజె కాలేజ్ పలాస)రెండవ స్థానం: ఎస్. పష్మాన్ ( ఐటిఐ పలాస)థ్రై జంప్ ఎన్. నితిన్ చక్రవర్తి,షాట్‌పుట్బాలురు (మొదటి స్థానం): కె. కార్తీక్,రెండవ స్థానం ఎస్. నారాయణ,బాలికలు (మొదటి స్థానం): చౌదరి హరిత, రెండవ స్థానం కె. శైలజ, జావెలిన్ త్రోబాలురు మొదటి స్థానం జి. లింగ ప్రధాన్,బాలురు రెండవ స్థానం ఎస్. విజయ్,బాలికలు (మొదటి స్థానం చౌదరి హరిత, అండర్-17 బాలురు విభాగంలో మొదటి స్థానం: కె. చిరంజీవి,ఆర్టిస్టిక్ పెయిర్ విభాగంలో విజేతలు:ఎమ్. జస్వంత్,పి. యదు వంశీ,రిథమిక్ విభాగములో మొదటి స్థానం: కె. తనీష్, రెండవ స్థానం: కె. తనీష్,మూడవ స్థానం: డి.ఎల్. కాశ్యప్,నాల్గవ స్థానం: టి. చందు, ఐదవ స్థానం: బి. కుమార్ స్వామి,ఎక్స్ట్రా ప్లేయర్‌డి. యుగంధర్లు . ఎంపికైన క్రీడాకారులను పలువురు అభినందించారు.

### ఇండ్లు, స్థలాలు వెంటనే మంజూరు చేయాలి



**సోంపేట, జులై 22 (వార్త):** అర్హులైన పేదవారికి ఇండ్లు, ఇండ్ల స్థలాలు వెంటనే మంజూరు చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథిని మండల టిడిపి అధ్యక్షుడు మద్దు కుమార్, మాజీ జడ్పిటిసి సూరాడ చంద్రమోహన్, ఏఎంసీ చైర్మన్ ప్రతినిధి మద్దిల నాగేశ్వరరావు వినతి పత్రం అందించి విజ్ఞప్తి చేశారు. పలాస పర్యటనకు మంత్రి పార్థసారథి బుధవారం రావడంతో పలాస ఇచ్ఛాపురం ఎమ్మెల్యేలు గౌతు శిరీష, బెందాళం అశోక్ సమక్షంలో గృహ నిర్మాణం పై రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నేతలు బారువా మేజర్ పంచాయతీలోనే సుమారు 500 మంది అర్హులు ఉన్నట్లు అధికారులు గుర్తించారని తెలిపారు. కొర్లాం, మామిడిపల్లి, మా కన్నపురం, పాలవలస, కర్తలపాలెం గ్రామాల్లో ఇల్లు లేని వారు అధికంగా ఉన్నారని పేర్కొన్నారు.

### పరిశుభ్రత పాటించి పోషకాహారాన్ని అందించాలి

**మెళియాపుట్టి, జులై 22 (వార్త):** పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో పరిశుభ్రత పాటించి నాణ్యత ప్రమాణాలతో విద్యార్థులకు పోషక ఆహారాన్ని అందించాలని మండల విద్యాశాఖధికారి మల్లారెడ్డి పద్మనాభం అన్నారు. బుధవారం నాడు ఆయన మండలంలో గల బందపల్లి జీపీఎస్ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో మెనూ ప్రకారం నాణ్యత ప్రమాణాలు పాటించి పరిశుభ్రత పాటించి పోషకాహారాన్ని అందించాలన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం సమర్థవంతంగా అమలవడం ద్వారా విద్యార్థుల ఆరోగ్యం, హాజరు శాతం మెరుగుపడుతుందని మండల విద్యాశాఖధికారి పద్మనాభం తెలియజేస్తూనే విద్యార్థులతో పాటు కలసి సహపంక్తి భోజనం చేశారు

### యోగా పోటీల్లో శ్రీ సత్య సాయి
### విద్యా విహార్ విద్యార్థుల ప్రతిభ

**పలాస, జులై 22 (వార్త):** యోగలో రాణిస్తే ఉన్నతా అవకాశాలు కలుగుతాయని ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశం పేర్కొన్నారు. బుధవారం పలాస గవర్నమెంట్ జూనియర్ కాలెజ్ గ్రౌండ్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన అమరావతి ఛాంపియన్‌షిప్ నియోజకవర్గ స్థాయి యోగ పోటీలలో రామకృష్ణాపురంలో ఉన్న శ్రీ సత్యసాయి విద్యా విహార్ పాఠశాల విద్యార్థుల విశేషమైన ప్రతిభా కనబరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం తొమ్మిది స్థానాల్లో మా పాఠశాల చెందిన విద్యార్థులు ముందు ఏడు స్థానాలను దక్కించారని, జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. యోగా కోర్సులు చేసిన వారికి ఇన్స్ట్రక్టర్, యోగా థెరపిస్ట్, కార్పొరేట్ కోచ్, ఆన్‌లైన్ టీచర్ వంటి కెరీర్ అవకాశాలు వస్తాయి అని చెప్పారు. యోగా నేర్చుకుంటే ఆరోగ్య ప్రయోజనాలతో పాటు ఉపాధి అవకాశాలు కూడా వస్తాయని, స్కూళ్లు, హాస్పిటల్స్, ఫిట్‌నెస్ సెంటర్లు, కార్పొరేట్ కార్యాలయాలు, యోగా స్టూడియోలు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫార్ములు వంటి చోట్ల పని చేసే వీలుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలోఉపాధ్యక్షులు తాలాసు శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ప్రీతిచౌదరి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. ముఖ్యంగా పి ఈ టి కిరణ్ ను ప్రత్యేకంగా ప్రశంసించి భవిష్యత్తులో మరిన్ని విజయాలనిపెట్టే ఆశలు వ్యక్తంచేశారు.

## శివ..శివా..!

✻ హైకోర్టు ఆదేశాలతో ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న శివాలయం కూల్చివేత ✻ వంశధార ప్రాజెక్టు నిర్వాసిత గ్రామంలో ఉద్రిక్తత ✻ భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేత ✻ ప్రత్యామ్నాయ స్థలంలో ఆలయ నిర్మాణానికి సహకరిస్తామని అధికారుల హామీ





**కొత్తూరు, జూలై22 (వార్త):** వంశధార ప్రాజెక్టు నిర్వాసిత గ్రామంలో ప్రభుత్వ భూమిలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న శివాలయాన్ని హైకోర్టు ఆదేశాల మేరకు అధికారులు బుధవారం యంత్రాల సహాయంతో కూల్చివేశారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య జరిగిన ఈ చర్యతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నప్పటికీ, అధికారులు గ్రామస్తులకు నచ్చజెప్పడంతో కూల్చివేత ప్రశాంతంగా ముగిసింది.వివరాలలోకి వెళితే.. కొత్తూరు మండలం నేరడి బౌండరీ పరిధిలోని సర్వే నంబర్ 392/5బిలో ఉన్న భూమిని 2007లో వంశధార ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రభుత్వం భూసేకరణ ద్వారా స్వాధీనం చేసుకుంది. అనంతరం ప్రాజెక్టు కారణంగా నిర్వాసితులైన బర్రిపేట, పెద్ద సంకిలి గ్రామాల ప్రజలు పునరావాస ప్రాంతంలో నివాసం ఏర్పరుచుకున్నారు. ఈ క్రమంలో నిర్వాసిత గ్రామ ప్రజలు తమ ఆరాధ్య దైవమైన పరమేశ్వరుడికి ఆలయం నిర్మించాలని నిర్ణయించి, ప్రభుత్వ భూమిలో శివాలయ నిర్మాణాన్ని ప్రారంభించారు. గ్రామస్తుల విరాళాలతో నిర్మాణం కొనసాగి దాదాపు పూర్తయింది. గర్భగుడి, మండపం నిర్మాణ పనులు పూర్తవగా, ప్రతి ష్ఠాపనకు కూడా ఏర్పాట్లు జరుగుతున్నాయి.అయితే ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా శాశ్వత నిర్మాణం చేపట్టడం చట్టవిరుద్ధమని పేర్కొంటూ అదే నిర్వాసిత గ్రామానికి చెందిన బూర్లె శ్రీనివాసరావు స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. పలుమార్లు వినతిపత్రాలు అందజేసినప్పటికీ నిర్మాణాన్ని నిలిపివేయడంలో అధికారులు చర్యలు తీసు కోలేదని ఆరోపిస్తూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు.పిటిషన్‌ను విచారిం చిన హైకోర్టు, సంబంధిత శాఖల నివేదికలను పరిశీలించి, శివాలయం ప్రభుత్వ భూమిలోనే నిర్మిస్తున్నట్లు నిర్ధారించింది. ప్రభుత్వ భూమిలో అను మతులు లేకుండా చేపట్టిన నిర్మాణాన్ని తొలగించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. హైకోర్టు ఉత్తర్వులు అందుకున్న జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో టెక్కలి ఆర్డీఓ ఆధ్వర్యంలో రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసు శాఖల అధికారులు బుధ వారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకున్నారు.కూల్చివేతకు ముందు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామ పెద్దలు, నిర్వాసితులతో అధికారులు చర్చలు జరిపి హైకోర్టు ఆదేశాలను వివరించారు. అనంతరం జేసీబీ యంత్రాల సహాయంతో నిర్మాణంలో ఉన్న శివాలయాన్ని కూల్చివేశారు...గ్రామస్తుల్లో ఆవేదనతాము ఎంతో భక్తిశ్రద్ధలతో గ్రామ ప్రజల విరాళాలతో ఆలయాన్ని నిర్మించామని, ప్రతిష్ఠాపనకు సిద్ధమవుతున్న సమయంలో కూల్చివేయడం బాధాకరమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయడం తప్ప అధికారులకు మరో మార్గం లేదని అధికారులు వివరించినట్లు తెలిసింది. కూల్చివేత అనంతరం గ్రామస్తులతో అధికారులు సమావేశ మయ్యారు. గ్రామస్తులు సూచించే అనువైన స్థలంలో నిబంధనల ప్రకారం శివాలయ నిర్మాణానికి అవసరమైన సహకారం అందించేందుకు జిల్లా కలెక్టర్ తనవంతు కృషి చేస్తారని అధికారులు హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ కూల్చివేతతో వంశధార ప్రాజెక్టు నిర్వాసిత గ్రామాల్లో చర్చనీయాంశంగా మారిన ఈ వివాదానికి తాత్కాలికంగా తెరపడినప్పటికీ, ప్రత్యామ్నాయ స్థలంలో ఆలయ నిర్మాణంపై గ్రామస్తులు అధికారుల నిర్ణయాన్ని ఆశగా ఎదురుచూస్తున్నారు.ఈ కార్యక్రమంలో టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తి, డీఎస్పీ లక్ష్మణరావు, కొత్తూరు తహసీల్దార్ వై. సరోజిని, ఎస్ఈ రామచంద్రరావు, ఈఈ సీతారామ నాయుడు, డీఈ మురళీమోహన్, వరప్రసాద్తో పాటు రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546